# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సముద్ర సాంప్రదాయాలు, దేశాల ఐక్యత, పరస్పర సహకారాన్ని ఫ్లీట్ రివ్యూ ప్రతిబింబిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు.**

2. **ప్రభుత్వ ఆసుపత్రులలో పడకల సామర్థ్యాన్ని పెంచే ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శాసనసభలో పేర్కొన్నారు.**

3. **జాతీయ రహదారుల వెంబడి పచ్చదనం కోసం నిధులు కేటాయిసున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.**

4. **చిత్తూరు జిల్లా కుప్పం రైల్వే స్టేషన్ లో రెండు ఎక్స్ ప్రెస్ రైళ్ల నిలుపుదలకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది.**

==========================

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ – ఐఎఫ్ఆర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. నౌకాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రయాణించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

--------------------------

యుద్ధ నౌకల పెరేడ్‌ను వీక్షించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ... సముద్ర సాంప్రదాయాలు, ఐక్యత, దేశాల పరస్పర సహకారాన్ని ఫ్లీట్ రివ్యూ ప్రతిబింబిస్తుందని ఉద్ఘాటించారు. భారత్ అనేక ఏళ్ళుగా వాణిజ్యాన్ని, సాంస్కృతిక మార్పిడిని సముద్ర మార్గాల ద్వారా నిర్వహించిందని రాష్ట్రపతి పేర్కొంటూ...

..వాయిస్.. 30 సెకన్లు

--------------------------

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను

శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ప్రశ్నోత్తరాలలో భాగంగా శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల సామర్థ్యం పెంపుపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధామిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పడకల సామర్థ్యాన్ని 50 నుంచి 100 పడకలకు పెంచాలనే ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 100 కిలోమీటర్లుకు ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేసే విషయంలో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

జాతీయ రహదారుల వెంబడి పచ్చదనం మొక్కల పెంపకం, నిర్వహణ కోసం నిర్మాణ పనుల ఖర్చులో ఒక శాతం నిధులు కేటాయిసున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. రహదారుల విస్తరణలో భాగంగా చెట్ల తొలగింపుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. జాతీయ రహదారులు రాష్ట్ర రహదారుల విస్తరణ పనులు చేపట్టేప్పుడు రోడ్ల విస్తరణ భాగంలో అడ్డు వచ్చే చెట్లను మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు. అలాగే ఏళ్ల తరబడి ఉన్న చెట్లు, భారీ వృక్షాలను ఇతర ప్రాంతాలకు మార్చేలా స్థానాంతరీకరణ చర్యలు తీసుకుంటున్నామని తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఢిల్లీలో ఎఐ ఇన్‌పాక్ట్ సదస్సు-2026 కొనసాగుతోంది. ఈ సదస్సులో మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రామ్‌గూలం, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లైఈరోజు పాల్గొననున్నారు. మారిషస్ ప్రధానమంత్రి భారత్ పర్యటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో డిజిటల్ సహకారానికి కీలకంగా నిలుస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే కృత్రిమ మేధ వినియోగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఎఐ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొంది.

---------------------------

చిత్తూరు జిల్లా కుప్పం రైల్వే స్టేషన్‌లో రెండు ఎక్స్ ప్రెస్ రైళ్ల నిలుపుదలకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. ఈమేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లేఖ రాశారు. వాస్కోడగామా – వేళాంకణి మధ్య నడిచే ఎక్స్ ప్రెస్ రైలు కుప్పం రైల్వే స్టేషన్‌లో ఆగేందుకు ఆమోదం తెలిపినట్టు స్పష్టం చేశారు. అలాగే దాదర్ సెంట్రల్ – పాండిచ్చేరి ఎక్స్ ప్రెస్ రైలు కూడా ఇక నుంచి కుప్పం రైల్వే స్టేషన్ లో నిలుపుదల చేసేందుకు ఆమోదించినట్టు రైల్వే శాఖ మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసి కుప్పం మీదుగా నడిచే దూరప్రాంత ఎక్స్ ప్రెస్ రైళ్ల స్టాపేజ్ కోసం స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయని, కుప్పం రైల్వే స్టేషన్ లో ఈ ఎక్స్ ప్రెస్ రైళ్లకు స్టాపేజ్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఉభయ గోదావరి జిల్లాల్లో మురుగునీరు కారణంగా పంట నష్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం

సర్వే చేయడానికి 17 కోట్ల రూపాయలను విడుదల చేశామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఉభయ గోదావరి జిల్లాల్లో డ్రైనేజ్ సమస్యలు, పంట నష్టాలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. సర్వే పూర్తయిన వెంటనే సమగ్ర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మల్కీపురం, మామిడికుదురు మండలాల పరిధిలోని కేసనపల్లి, శంకరగుప్తం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున కొబ్బరి చెట్లు ఎండిపోయినట్లు నివేదికలు అందాయని పేర్కొన్నారు. ప్రతి చెట్టుకు వెయ్యి రూపాయల చొప్పున మొత్తం 10 కోట్లరూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్యానవన శాఖ ప్రతిపాదనలు సమర్పించిందని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడ నగరాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ గురునానక్ కాలనీలో ఇన్‌ఫ్రారెడ్ సాంకేతికత ద్వారా రహదారుల గుంతలు పూడ్చే నూతన మరమ్మతుల సంచార యంత్రాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 20వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ,అనంతపురం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పివి.ప్రతాప రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉరవకొండ వెలుగు కార్యాలయంలో ఈ మేళా నిర్వహించనున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ బి.టెక్ పూర్తిచేసి 18 నుండి 35 సంవత్సరాల వయసు గల యువత పాల్గొనవచ్చని తెలిపారు.ఉద్యోగ మేళాలో పాల్గొనే అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్ సైట్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో జనన, మరణాల నమోదుకు కొత్త నిబంధనలను ప్రభుత్వం జారీ చేసింది. 21 రోజుల్లో నమోదు తప్పనిసరి చేస్తూ ఈ మేరకు వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పుట్టిన లేదా మరణించిన తేదీ నుంచి 21 నుంచి 30 రోజుల్లోపు నమోదు చేస్తే 25 రూపాయల అపరాధ రుసుము చెల్లించాలి. 30 రోజుల తర్వాత నుంచి ఏడాది లోపు నమోదు చేయాలంటే జిల్లా రిజిస్ట్రార్ అనుమతితో పాటు 250 రూపాయల అపరాధ రుసుము చెల్లించాలని తెలిపింది.

======================